ఓం నమోభగవతే శ్రీ రమణాయ
శ్రీ భారతీ దేవ్యై నమః

ఉమాసహస్రము

(తృతీయశతకమున - చతుర్థస్తబకము)

ద్వాదశస్తబకము

అవ:- పార్వతీ - పరమేశ్వర శృంగారరసముల్లసితమగు పండ్రెండవస్తబకమారంభింపఁబడుచున్నది. అందు మొదట - మందహాసము ప్రస్తుతింపఁబడుచున్నది.

మూ॥ శర్వ ధైర్యగుణ శాతశస్త్రికా
శమ్బరారిజయ కేతుపట్టికా
మన్దహాసకలికా, మదాపదం
పర్వతేన్ద్రదుహితుర్వ్యపోహతు ॥ 1

శర్వుని ధైర్యగుణమునకు శాతశస్త్రికయు, మన్మథునకు విజయ ధ్వజపతాకయు, అగు పర్వతేంద్ర - పుత్రి - మందహాస కలిక - నాయాపదను తొలగించుగాక!

ప్రభ:- శర్వుని = శివుని యొక్క, ధైర్యగుణము = మనో వికారములను తొలఁగియుండుట ధైర్యము - ఆ ధైర్యమే యగుగుణము - రజ్జువు 'ధైర్య గుణము' అని చెప్పబడును. శివుని ధైర్యగుణమను త్రాటిని తెగఁగోసినదియు, మన్మథునకు జయపతాకయు అగు పార్వతీ మందహాసకలిక - నాయాపదను బాపుఁగాతమని ప్రార్థింపఁబడినది. శాతశస్త్రిక - వాడియగు చిన్నకత్తి, మందహాసకలిక = మొగ్గవంటి

చిరునవ్వు. పూర్వ పదార్థమగు మందహాసమే - ఆపన్ని వారణసమర్థము. కావుననదియే ప్రధానమగుట వలన నిది యుపమితసమాసమగుచున్నది. ఇచట 'కలిక' అనుపదము యొక్క సమర్థతవలన - హాసము మన్మథునిచే ప్రయోగింపఁబడిన బాణరూపమగు పుష్పమనునంశము - ఆక్షేపింపఁబడి వ్యంజింపఁజేయఁబడుచున్నదని గ్రహించునది.

మూ॥ ముక్తభోగికటకేన పాణినా
ముగ్ధగాత్రి! పరిగృహ్యతేకరమ్
ఏకదాశశికిశోరశేఖరః
సఞ్చచార రజతాద్రిభూమిషు ॥ 2

ముగ్ధగాత్రి! ఒకానొకప్పుడు శశి - కిశోరశేఖరుఁడు ముక్తభోగి కటకమగు పాణితో నీపాణిని పరిగ్రహించి - రజతాద్రిభూములయందు విహరించెను.

ప్రభ:- ముగ్ధగాత్రీ! = సుందరాంగివగు జననీ! శశికిశోరశేఖరుఁడు = బాలచంద్రచూడుఁడు. ముక్త భోగికటకము - విడువఁబడిన సర్పమను వలయము గలది. రజతాద్రిభూములయందు = కైలాసప్రదేశములయందు.

భూషణసర్పమునువిడిచి, సుందరమూర్తియగు చంద్రశేఖరుడు - పరిణయమయిన వెనుక పార్వతితోఁగూడి కైలాసపర్వతో ప్రాంతములయందు విహరింపఁబూనెనని భావము. భూషణమగు నాగమునేకాక, భీతి - జుగుప్సావహములగు జటలను గజచార్మదులనుగూడ పరిత్యజించి - శృంగారభావానుగుణమగు శశికిశోరధరవేషముతోఁ గూడిన భగవానుఁడు - శుభ్రమగు స్వహస్తముతో భగవతీకోమల హస్తమును గ్రహించి విహరించెనను నర్థమిచట స్పష్టముగాఁ దెలియునది.

ద్వితీయ శతకమునందలి ప్రథమస్తబకమున పురారికి - జ్వలత్ కపర్దత్వాదికమగు ప్రసిద్ధ భయంకరరూపము సమయాంతరముల యందగునని తెలిపి, ''భగవానుఁడు నీతోఁగూడి విహరించునపుడు మాత్రము, కాంతమగు శరీరమును, కాంతతరములగు లీలలను ధరించును'' అని చెప్పఁబడినదిగదా!

అవ:- ఇప్పుడు దేవితోఁగూడి, కమనీయభావమున విహరించుచున్న పరమేశ్వరుని కామెయెడఁగలిగిన యభిలాషమును (అభిలాష శృంగారము) దెలుపుటకు తుమ్మెదలతోఁగూడిన పూలతోటలు, చక్కనిపొదరిండ్లు, కోకిల కలకలలు మొదలగు ఉద్దీపన విభావములను పంచశ్లోకములచే వర్ణించుచున్నాఁడు.

మూ॥ తస్య తత్ర పరితః పరిభ్రమన్,
వల్లభాం వకులపుష్పచుమ్బినీమ్
పార్వతి! త్వదలకోపమద్యుతి
శ్చఞ్చరీక తరుణో మనో ఉధునోత్॥ 3

పార్వతీ! ఆ కైలాసభూములయందు, వకులపుష్పచుంబినియగు ప్రియరాలిచుట్టును దిరుగుచు, నీముంగురులతో నుపమింపఁదగి, కాంతులు గలిగిన చంచరీకయువకుఁడు పరమేశ్వరుని మనస్సు చలింపఁజేసెను.

ప్రభ:- వకులపుష్పచుంబిని = పొగడపూఁదేనెనానునది. ప్రియురాలిని = ఆడుతుమ్మెదను, చంచరీకతరుణుఁడు = భ్రమరయువకుఁడు. భ్రమరవిలసితమగు పుష్ప సమృద్ధిని వీక్షించుట చేత పార్వతీ కాంతుని మనసు కంపితమయ్యెననిభావము. ఇచ్చట 'ప్రతీపముపమేయస్యోపమానత్వప్రకల్పనమ్'' ఉపమేయము నుపమానముగా ప్రకల్పించు నెడల ప్రతీపము'' అను లక్షణమునను సరించి ఉపమేయములగు అలకములను (ముంగురులను) ఉపమానముగాఁ జెప్పుట వలన నిందలియలంకారము ప్రతీపమగుచున్నది.

మూ॥ ప్రేయసీం చపలచారులోచనా
ముల్లిఖన్ వపుషి శృఙ్గకోటినా
త్వద్విలోకితనిభైర్విలోకితైః
ధూర్జటే రమదయిన్ మనో మృగ॥ 4

చపలచారులోచనయగు ప్రేయసి శరీరమును (హరిణియొక్క శరీరమును) శృంగకోటితో గోకుచున్న హరిణము (మగలేడి) నీ చూపులకు సరియగుచున్న చూపులచేత ధూర్జటి హృదయమును మదింపఁజేసినది.

ప్రభ:- చపలచారులోచన = చంచల సుందరములగు నయనములు గలది. ఆడులేడియెడల మగలేడి వెలార్చు ప్రేమవిలాసముల దర్శనము పరమేశ్వర మనోమాదకమయ్యెనని భావము. ''నీ చూపులకు సరియగుచున్న'' అని యుపమేయములగు పార్వతిచూపుల నుపమానముగా ప్రకల్పించుటవలననిదియు ప్రతీపమేయగును.

మూ॥ మఞ్జుకుఞ్జభవనాని మాలతీ
పుష్ప రేణుసురభిః సమీరణః
పేశలాచ పికబాలకాకలీ
మోహమీశ్వరి! హరస్యతేనిరే॥ 5

ఈశ్వరీ! మంజాకుంజభవనములును, మాలతీసుమపరాగసుగంధియగు సమీరణమును, పేశలమగు బాలకోకిక కాకలియు. హరునకు మోహము ఘటించినవి.

ప్రభ:- మంజాకుంజభవనములు = మంజులములగు లతాగృహములు, సమీరణము = గాలి, పేశలము = రమణీయము. కాకలి = అవ్యక్తమధుర సూక్ష్మధ్వని విశేషము. తీవియజొంపము - పూఁదావిగాలి - బాలకోకిలపాట - శివునికి మోహము నుదయింపఁజేసినవని భావము.

మూ॥ అగ్రతః కుసుమశోభితాలతాః
పార్శ్వతస్త్వ మగపాలబాలికే!
సర్వతో మదన శిఞ్జినీధ్వనిః,
ధీరతా కథమివాస్య వర్తతామ్ ॥ 6

ఎదుట – కుసుమశోభితలు లతలు, పార్శ్వమున – నగరాజబాలి కవునీవు, అంతటను – మదనశింజనీధ్వని, అతనికి ధీరత యెట్లుండును?

ప్రభ:- మధనశింజినీధ్వని – మన్మధుని యల్లెత్రాటిచప్పుడు (అది కోకిల కాకలియేయని గ్రహించునది) అతనికి = నీకాంతుఁడగుశివునకు, ఎదుటను – ప్రక్కను అంతటను – ఉత్తేజకములగు వస్తువులు దాపురించునపుడు – ధీరత – పలాయితయే యగునని భావము.

మూ॥ కీరకూజిత సమాకులేవనే
శమ్భుమమ్బ! తవపార్శ్వవర్తినమ్
ఆజఘాన మకరధ్వజశ్శరై
రర్దయ న్త్యవసరేహి శత్రవః ॥ 7

మనము – కీరకూజితసమాకులమగు చుండునపుడు, శంభుఁడు నీ పార్శ్వమునందుండెను. అప్పుడే మీనకే తనుఁడు నీ ప్రభువుపై బాణముల నేయఁదొడఁగెను. అవసరము ప్రాప్తించునప్పుడేగదా శత్రువులు పీడింతురు.

ప్రభ:- కీరకూజిత సమకూలము = శుకకూజిత పరీతము – చిలుక పలుకులతో నిండినది. ఇచట – ప్రకృతమగు విశేషము – అప్రకృతమగు సామాన్యముచేత సమర్థింపఁబడినది. కావుననిది అర్థాంతరన్యాసమును నలంకారమగుచున్నది.

మూ॥ తాడితో మకరకేతునాశరై
రంసదేశమవలమ్బ్యపాణినాం
ఏకహాయనకురఙ్గలోచనా
త్వామిదం కిల జగాదశ్కరః ॥ 8

మదనశరతాడితుఁడగు శంకరుడు – నిజపాణిచేత నీయంసదేశము నవలంబించి, ఏకహాయనకురంగనయనవగు నీతో నిట్లు పలికెనట!

ప్రభ:- అ సందేశము = స్కంధప్రదేశము. ఏకహాయన కురంగలోచన = ఒక సంవత్సరము వయస్సు గల లేడి యొక్క కన్నులువంటి కన్నులు గలది. శివుఁడు మన్మధబాణ పాతము వలన నొదవిన వేదనను సహింపలేక నీస్కంధ ప్రదేశము నూతగా గొని లజ్జావిచలిత నయనవగు నీతో నిట్లనియెనని భావము.

మూ॥ కాకలీకలకలం కరోత్యసౌ;
బాలచూతమధిరుహ్యకోకిలా
వాచ ముద్గిరసరోజలోచనే?
గర్వమున్న తమియం విముఞ్చతు ॥ 9

ఎదుట గాన్పించుచున్న యీ కోకిల – బాలరసాలమునఁ గూర్చుండి కాకలీధ్వనితో కలకలమనుచున్నది. ఓపద్మాక్షీ! ఒక్క మాటనాడితివా దాని యున్నతమగు గర్వమును విడుచును.

ప్రభ:- కోకిల = పిక వధువు, కాకలీధ్వని = సూక్ష్మము, మధురము, అస్ఫుటము, అగు ధ్వని విశేషము. శ్రవణసుభగమగు స్వరసంపత్తి చేత గర్వించిన పికాంగన – ఎదుటనున్న తీయమామిడి గున్నయందుండి యెట్లు కలకలమనుచున్నదో వింటివా? నీస్వరమింత కంటెను చాలతీయనిది. కావున నీకంఠధ్వనిచేత నాకర్ణములయందమృతము నింపుము'' అనుభావము వ్యంజితము.

మూ॥ ఫుల్లకున్దమకరన్దవాహినో
మల్లికా ముకులధూలిధారిణః
కమ్పయన్తి శిశవఃసమీరణాః
పల్లవానిహృదయంచ తన్వి! మే ॥ 10

సుందరీ! వికసించిన మల్లెపూవుల తేనియలను భరించునవియు (మోయునవియు), మల్లెమొగ్గలపరాగమును ధరించునవియునగు, శిశు సమీరణములు – (పిల్లగాలులు గాలిపిల్లలు) నా హృదయమును – పల్లవములను గూడ కంపింపఁజేయుచున్నవి.

ప్రభ:- శిశుసమీరణములు = మందమారుతములు. మందమారుత కార్యమగు హృదయ – పల్లవముల కంపనము – ఇచట – మూలమున 'పల్లవాని హృదయంచ' అనుచోనున్న చకారముచేత, సహార్థము (తోడ) వాచ్యము చేయఁబడుటవలన నిది సహోక్తియను నలంకారమగుచున్నది.

మూ॥ వర్ణనేన హృతచక్షుషః శ్రియః
సుప్రసన్న మధురాకృతీనితే
అఙ్గకానిదయితే! భజేఽర్భకః
స్వేద బిన్దుహరణేనవాఽనిలః ॥ 11

ప్రియా! సుప్రసన్న మదురాకృతులగు నీఅంకములను స్వేదబిందు హరణము చేత – అర్భకుడగున నిలునివలె నాదృష్టి నాకర్షించుచున్న శోభయొక్క వర్ణనము చేత నేనుగూడ సేవింతును.

ప్రభ:- అంగకములను = లేతవగు అవయవములను, స్వేదబిందుహరణము చేత ఘర్మాంబు బిందువులను తొలఁగించుట చేత, అర్భకుడగు ననిలుఁడు = మందమారుతము చల్లగాలి – స్వేదాంబుకణములను తొలఁగించుట చేత నీయంగములందలి శ్రమతొలగుచేనట్లు సేవించువిధమున, నేనుగూడ మధురాకృతి

సంపన్నములగు నీయంగముల శోభను కీర్తించుటచేత – నీ హృదయమున ప్రీతికలుగునట్లు సేవింతుననిభావము.

మూ॥ తావదేవ మమచేతసోముదే
బర్హమే దనఘాఙ్గి బర్హిణః
యావదక్షిపథమేష విశ్లథో
గాహ తే న కబరీబరీభరస్తవ ॥ 12

అనవద్యగాత్రీ! నా పార్శ్వమున – విశ్లథమైయున్న యీ నీ కబరీభరము – నాదృక్ పథమును ప్రవేశింపకుండునంత వఱకును మాత్రమే ఈ బర్హిబర్హము – నా యొక్క మనస్సునకు ప్రీతినిచ్చుచుండును.

ప్రభ:- విశ్లథము = ముక్తబంధము = దిగజారుచున్నది. కబరీభరము = కేశపాశము. దృక్పథము = నేత్రమార్గము. బర్హిబర్హము – నెమలిపించము. నీకేశపాశ సౌభాగ్యము నీక్షించువఱకును నెమలిపించెమును జూచి ఇది నా ప్రేయసి కబరీభారమువలె నున్నదని సంతోషించుచుందునని భావము.

నెమలిపించెము కంటెనుగూడ కబరీభరమే చిత్తరంజకమును, రుచితరమును, అగుచున్నదను నంశము వాచ్యాయమాన మగుటవలన నీయలంకారము గమ్యమగు ప్రతీపమైయున్నది.

మూ॥ రాగవానధర ఏషసన్తతం
నిర్మల ద్విజసమీపవర్త్యపి
ఏభిరస్య సహవాసతః ప్రియే
నేషదప్యపగతో నిజోగుణః ॥ 13

ప్రియానీ! యీకెమ్మోవి – నిర్మలద్విజసమీపవర్తి యగుచున్నను సంతతమును రాగవంతమగుచున్నది. వీనితోడి సహవాసమువలన నీషన్మాత్రమును గూడ దీని నిజగుణము పోయినదికాదు.

ప్రభ:- నిర్మల – ద్విజ – సమీపవర్తి – శుభ్రములగు దంతముల సమీపమునందున్నది, లేక శుద్ధ సత్త్వగుణులగు బ్రాహ్మణుల సన్నిధియం దుండునది. రాగవంతము – రక్తవర్ణముగలది, లేక రాజసముగలది – అనురాగి.

శుద్ధసత్త్వగుణులగు బ్రాహ్మణుల సన్నిధియందున్నను రజోగుణమును విడువని జనమువలె తెల్లనిదంతముల చేరువనున్నను ఈయధరము రక్తవర్ణమును విడువకున్నదని తాత్పర్యము. ఇందు శ్లిష్టములగు నిర్మల – ద్విజ – రాగశబ్దములు – వాచ్యతా దశయందు ఒకేయర్థమును దెలుపుచు రెండవయర్థమును దెలుపుటను (పరివృత్తిని) సహింపవు. కావున శబ్దశక్తిమూలమగు ధ్వనన వ్యాపారముచేతనే ద్వితీయార్థము ధ్వనింపఁజేయఁబడుచుండును. కావున నిది శబ్దశక్తిమూలమును, సంలక్ష్యక్రమమును, అగు ఉపమాలంకార ధ్వనియగుచున్నది. సహజగుణము – సహవాసము చేనయినను తొలఁగదను నంశము – అర్థద్వయమునందును సమానమగును.

''సంసర్గజా దోషగుణాభవన్తి'

''సహవాసమువలన దోషగుణములు కలుగును' అను న్యాయము నైసర్గికములగు గుణములయందు సంభవింపదు'' అను హేతువువలన అధరము రాగమును విడువకున్నదను వాక్యార్థము సమర్థింపఁబడుట వలన నిచటి యలంకారము – కావ్యలింగమని గ్రహించునది.

మూ॥ చక్షుషః సుదతి తే సగోత్రతా
కైరవైర్నిశి దినే కుశేశయైః
కాశ్య పైరపి వసిష్ఠ బాన్ధవై
ర్భూసుపర్వణ ఇవ ద్విగోత్రిణః ॥ 14

సుదతీ! కశ్యపవంశజులతోడి సగోత్రతయు, వశిష్ఠవంశజులతోడి సగోత్రతయుఁ, గల ద్విగోత్రియగు భూసురునికివలె నీనయనమునకు – రాత్రియందు కైరవములతోడి సగోత్రతయు, పగటియందు కమలముల తోడి సగోత్రతయు కలదు.

ప్రభ:- సుదతీ! = చక్కని పలువరుసగల పార్వతీ. సగోత్రత = సమానమగు కులము కలిగియుండుట, కైరవములు = కుముదములు – కలువలు. ద్విగోత్రి – రెండుకులములు గలవాఁడు. రాత్రియందు కశ్యపసగోత్రులును పగటియందు వసిష్ఠసగోత్రులును అగు ద్వ్యాముష్యాయణులను – ద్విగోత్రులని చెప్పుదురు. నీకన్ను చంద్రుని తోడి చుట్టరికము చేత రాత్రియందు కలువపూవువలె నగుననియు, సూర్యునితోడి చుట్టరికము చేత పగటియందు తామరపూవువలె నగుననియు భావము. ఇందు వాచ్యమగు నలంకారము ఉపమ. ''నీనయనము – కమల – కైరవసగోత్రము'' అని చెప్పుట చేత రాత్రియందు కమలము వికసింపదు. పగటియందు కలువ వికసింపదు. కాన నీకన్ను రాత్రియందును పగటియందును (సతతమును) వికసించుచుండును. కావున నీ నయనోల్లసితము – వానికంటె నధికతరము అనునర్థము వ్యంజనచేఁ గొనిరాఁబడుట వలన నిచట వ్యతిరేకాలంకారము – ధ్వనింపఁజేయబడినదని తెలియునది.

మూ॥ అల్పయాప్యతి సమర్థయాస్మిత
జ్యోత్స్నయా గగనగం హరత్తమః
కేవలం సువచనామృతం కిర
చ్చన్ద్రబిమ్బమతుషార మాననమ్ ॥ 15

నీయాననము – అల్పమయినను (సూక్ష్మమయినను) అతిసమర్థమగు స్మితచంద్రిక చేత – ఆకాశమునందలి యంధకారమును తొలఁగించునదియు, కేవలమగు సువచనామృతమును ప్రచురించునదియు నగుచు, మంచులేనిచంద్రబింబమే అగుచున్నది.

ప్రభ:- కేవలము = నిర్ణీతము, అతుషారము = మంచులేనిది. (తుహీన దోషము లేనిది) స్మిత – చంద్రికలకును, వచన – అమృతములకును, చంద్ర – ఆననములకును అభేదమును నిశ్చయించుటవలన నిది సావయవరూపకాలంకార మగుచున్నది.

''నీయాననము – హిమ దోషదూషితము కాని చంద్రబింబమే'' అనుటచేత, పార్వతీముఖచంద్ర బింబము – ప్రసిద్ధచంద్ర బింబముకంటె నుగాడ నుత్కర్షింపఁబడినది. కావున నిది యధికాభేదరూపక మగుచున్నది.

మూ॥ నిత్యమబ్జముఖి! తే పరస్పర
శ్లిష్టమశ్లథపటీ కుటీరగమ్
శర్వరీభయ వివర్జితం స్థలీ
చక్రవాకమిథునం కుచద్వయమ్ ॥ 16

అబ్జముఖీ! నీవక్షోజయుగళి – నిత్యమును పరస్పర శ్లిష్టము, అశ్లథ పటీకుటీరగము, శర్వరీభయ వివర్జితము, అగు స్థలీచక్రవాకమిథునము.

ప్రభ:- పరస్పరంశ్లిష్టము = ఒకదానితో నింకొకటి కలిసియుండునది. ఎప్పుడును వియుక్తము కానిది. అశ్లథపటీకుటీరగము – దృఢముగా బంధింపఁబడిన యుత్తరీయమే నివాసగృహముగాఁ గలది. శర్వరీభయవివర్జితము – రాత్రియందగు భీతిలేనిది. స్థలీచక్రవాక మిథునము – భూతలమునందుండు కోకపక్షిద్వయి.

ఆకాశమునందుండు చక్రవాక మిథునమునకు రాత్రియందు వియోగము గలుగును – (స్తనయుగళియగు స్థలీచక్రవాకమిథునము నిత్యమును కలిసియేయుండును గావునవియోగము నొందదు) ఆకాశచరమగు చక్రవాక మిథునమున కెప్పుడును గూడ తాదృశమగు ఏక కుటీరనివాసము గలుగదు. దీనికే వియోగమువలన రాత్రివలని భయముగలదు. ఇట్లు – వ్యోమచరమగు ప్రసిద్ధచక్రవాకముకంటె, స్తనయుగళియే యగు స్థలీ చక్రవాకమున కుత్కర్షము చెప్పఁబడుటవలన ఇదికూడ అధికాభేదరూపకమే యగుచున్నది.

మూ॥ లాలనీయమయి! దేవమౌళిభిః
కోమలం చరణపల్లవ ద్వయమ్
కచ్చిదద్రిపురుహూతపుత్రికే!
నస్థలీ తుదతి కర్కశాతవ ॥ 17

అమ్మాయీ! పర్వతేంద్రకుమారీ! దేవమౌళిలాలనీయమును, సుకుమారమును, అగు నీచరణపల్లవద్వయమును కర్కశమగు నీ ప్రదేశము బాధించుట లేదుగదా?

ప్రభ:- దేవమౌళిలాలనీయము = దేవతల కిరీటము చేత కోరఁదగినది. (భజింపదగినది) చరణపల్లవద్వయము = పల్లవమృదులమగు పాదయుగళము. పర్వతచక్రవర్తి పుత్రిక యొక్క కోమలపాదయుగళి – శిలా కార్కశ్యమున బాధింపఁబడ వచ్చుననియాశంకించి శివుఁడామెనోదార్చుటకు ప్రశ్నించుచున్నాఁడు. ప్రేయసియగు కాంతకు నిజముగా నించుక వేదన కలిగియున్నను గూడ, ప్రియునిచే గావింపఁబడిన యీదృశములను ప్రశ్నోపచారముల వలన ఆ వేదనలేనిదివలెనయి ప్రీతియే జనించునుగదా!

మూ॥ ఏవమాదివదతి త్రిలోచనే
త్వన్ముఖేలసతి మౌనముద్రయా
ఆతతాన జలచారి కేతనో
నర్తనం నగమహేన్ద్రబాలికే ॥ 18

ఓ నగరాజపుత్రికవగు జననీ! ఇది (పూర్వోక్తము) యాదిగాఁ గల వాక్యమును త్రిలోచనుఁడగు శివుఁడు పలుకుచుండునప్పుడు నీవచనము, మౌనముద్రచే విలసిల్లుచుండ. మీనకేతనుఁడగు మన్మథుఁడు స్వీయమగు నర్తనమును విస్తరింపఁజేసెను.

ప్రభ:- మౌనముద్ర = మాటాడకుండుటయే స్వరూపముగాఁగలది. ప్రతివచనమునీయక నీపూరకున్నను గూడ నీముఖమున నేదో (అనిర్వచనీయమగు) విలాసము కలగుటయు, ప్రత్యుత్తరము నీయకుండుట చేతనే నీ ప్రియునకు నీయందలి యనురాగము ప్రవృద్ధమగుటయు, వీక్షించి – ఇదియే సమయమని మన్మథుఁడు శివునియందావేశించి, యతఁడింకను నీకుపచారములను గావించునట్లొనర్చెనని భావము.

మూ॥ దేవి! తే పురజితావతంసితః
పారిజాత కుసుమ ప్రజాకచః
మానసం పురజితో౾ ముహ్హాతం
స్మర్యతే క్వ మలినాత్మ నాకృతమ్ ॥ 19

దేవీ! పురారియగు శివుఁడు పారిజాతపుష్పమాల చేత నీశిరోజము నలంకరించెను. ఈ శిరోజము – పురజితుఁడగు నతని మానసము నపహరించెను. మలినాత్మ – చేసిన మేలుస్మరించునా?

ప్రభ:- శిరోజము = కచము–జుట్టు. మలినాత్మ – అశుభ్రము, లేక పాపాత్ముఁడు. పాపాత్ముఁడు సర్వవిధముల చేతనుగూడ కృతఘ్నుఁడగునని భావము. శిరోజము – నల్లనది కావునను జడరూపము కావునను దాని స్వరూపము మలినము.

ఇచటః– ''ప్రభువగు పరమేశ్వరుని చేత శిరోజమునకు పారిజాతపుష్పాలంకారము చేయఁబడినది. ఆ శిరోజము చేత అతని మానసాపహరణము కావింపఁబడినది.'' అనుటచేత దేవీ శిరోజ ప్రసాధన కైంకర్య లాభమునకు – స్వమనోదానమే మూల్యమయ్యెనను నర్థము వ్యంజింపఁజేయబడినది. దానివలన పరివృత్తి అనునలంకారము ధ్వనింపఁజేయఁబడుచున్నది. 'మలినాత్మ – కృతఘ్నుఁడు' అను సామాన్యమగు వేఱొకయర్థము చేత – ''పురంజయుని మానసమును (మలినాత్మయగు) శిరోజము – దొంగిలించెను'' అను ప్రస్తుతమగు విశేషము – సమర్థింపఁబడుటవలన నిది అర్థాంతర న్యాసాలంకారమగుచున్నది.

మూ॥ బ్రహ్మచర్య నియమాదచఞ్చలా
నాయికాయది లులాయమర్దినీ
నాయకశ్చ సుమబాణసూదనో
వేద కో రతి రహస్యమావయోః ॥ 20

లులాయమర్దినియగు నాయిక – అస్ఖలితబ్రహ్మచర్యనియత. నాయకుఁడు – సుమబాణసూదనుఁడు అగుచుండునపుడు – వీరల ''రతి రహస్యమును'' ఎవ్వఁడెఱుఁగును?

ప్రభ:- లులాయమర్దిని = మహిషమర్దిని. సుమబాణ సూదనుఁడు – మన్మథనాశనుఁడు. అప్రాకృతమగు (దివ్యమగు) శరీరముఁగలిగి నిత్యమగు బ్రహ్మచర్య వ్రతమునుండి చ్యుతినొందని మహిషాసురమర్దిని – నాయకయు, పుష్పబాణుని జయించిన పరమేశ్వరుఁడు నాయకుఁడును అగునెడల ప్రపంచమాతా పితరులగు ఆ పార్వతీ పరమేశ్వరుల యప్రమేయమగు రతిస్వరూపము నెఱుఁగుటకు సమర్థుడ్వొఁడును లేఁడని భావము. కడచిన శ్లోకముల యందు పార్వతీపరమేశ్వరుల విషయమున శృంగార ముపన్యసింపఁబడినది. పామరస్త్రీ – పురుషోచితమగు మదనవిలాసము పార్వతీ పరమేశ్వరుల యందారోపింపఁబడఁగూడదను నభిప్రాయమున మీఁది శ్లోకము చెప్పఁబడినదని గ్రహించునది.

మూ॥ లోచనోత్సవవిధౌ విశారదే
వారిదావరణదోషవర్జితే
మర్దయత్యపి నభోగతం తమః
శ్యామికారహిత సున్దరాకృతౌ 21

భాతిశీతకిరణస్తనన్ధయే
ప్రాణనాయక జటాకుటీజుషి
శుభ్రపర్వతతటే శుభాఙ్గి! తే
సమ్మదాయ నబభూవ కానిశా ॥ 22

శుభాంగివగు (దివ్యమంగళ విగ్రహవగు) జననీ! నయనోత్సవమును గావించుటయందు విశారదుఁడును, మేఘాచ్ఛాదనదోష వర్జితుఁడును నభోగతమగునంధకారమును మర్దించువాఁడయినను, శ్యామికా (కళంక) రహితమును

సుందరమును అగు నాకృతిగలవాఁడును, ప్రాణ నాయకుఁడగు పరమేశ్వరుని - జటాకుటీరమున వసించువాఁడును అగు శీతకిరణస్తనంధయుఁడు - విలసిల్లుచుండఁగా, శ్వేతగిరిప్రదేశమున (విహరించుచున్న) నీకు - సమ్మదముఁగూర్చని రాత్రి యొక్కటియయినను గలదా? (రాత్రులన్నియుఁగూడ నీకానందదాయకములే)

ప్రభ:- విశారదుఁడు = విచక్షణుఁడు - కుశలుఁడు, నేర్పరి - మేఘాచ్ఛాదన దోషవర్జితుడు - మేఘపటలము యొక్క ఆవరణమను దోషములేనివాఁడు. శీతకిరణ స్తనంధయుఁడు = బాలచంద్రుఁడు. శ్వేతగిరి ప్రదేశమున - కైలాసప్రాంతమున. ప్రసిద్ధుఁడగు చంద్రుఁడు - ఎల్లప్పుడును కన్నులకు పండుగచేయఁడు. ఒక్కొక్క సమయమున మేఘావృతిదోషము నొందియుండును. ఆకాశమునందలి చీకటిని తొలగించుచున్నను, దాని స్పర్శవలన నొదవిన కళంకముతోఁ గూడుటవలన నసుందరమగు రూపము గలిగియుడును. పరమేశ్వర జటాకుటీరము నందుండడు. బాలచంద్రుఁడు నిత్యమును నేత్రోత్సవము నొనర్చును. మేఘాచ్ఛాదన దోషము లేకుండును. ఆకాశమునందలి యంధకారమును మర్దించుచున్నను దాని స్పర్శవలని కళంకములేకుండుట వలన అలౌకిక సుందరమూర్తి యగుచుండును. పరమేశ్వర జటావాసమున విలసిల్లుచుండును అని భావము.

ఇట్లు ప్రసిద్ధచంద్రునికంటెను వ్యతిరిక్తుఁడగు బాలచంద్రుని వైభవమును స్తుతించుటవలన పార్వతికి ప్రాణనాయక విషయమునందగు రతిభావము ధ్వనింపఁజేయఁబడుచున్నది.

మూ॥ సన్తు భూషణ సుధాంశుధీధితి
వ్యక్త ముగ్ధముఖశోభయోర్మిథః
తాని తాని గిరిజా - గిరీశయోః
క్రీడితాని జగతో విభూతయే ॥ 23

శిరోభూషణ - చంద్రధీధితుల చేత స్పష్టములగు ముగ్ధముఖ శోభలు గల గిరిజా - గిరీశ్వరుల పారస్పరికములగు ఆయాక్రీడితములు - లోకమునకు విభూతి నొసఁగుఁగాక!

ప్రభ:- ధీధితుల చేత = కాంతుల చేత, ముగ్ధముఖ శోభలు = సుందరములగు ముఖ ప్రభలు. గిరిజా - గిరీశ్వరులు - పర్వతమునకఁ బుట్టిన పార్వతి (కైలాస) పర్వతమున కధిపతియగు పరమేశ్వరుఁడు. పార్వతీ - పరమేశ్వరుల - అనిర్వాచ్య రహస్య - రతి విలసితములు - లోక శ్రేయః ప్రదములగుఁగాత. అను నీయాశీశ్సు - శృంగార వర్ణనోప సంహారసందర్భ అని గ్రహించునది.

మూ॥ మోదకాదనపరస్య సృష్టయే
క్రీడితం జనని! వాంకి మప్యభూత్
శక్తిభృత్ తనయరత్న జన్మనే
కిఞ్చిదీశ్వరి! బభూవ ఖేలనమ్ ॥ 24

తల్లీ! యీశ్వరీ! మోదకములను (జిల్లుడుకాయలను పిండి వంటలను) భుజించుటయే ప్రధానముగాఁగల లంబోదరుఁడగు గణపతిని సృజంచుటకును, శక్తిధరుఁడును, కుమార శ్రేష్ఠుఁడును అగు సుబ్రమ్మణ్యుని జనింపఁజేయుటకును, మీరొనర్చిన (వేర్వేరగు) క్రీడితవిశేషములు - అనిర్వచనీయములు. (తెలియరానివి)

ప్రభ:- క్రీడితవిశేషములు = రతివిలసిత విశేషములు, గణపతి - సుబ్రహ్మణ్యులను ప్రభవింపజేయుటకు మీకు ద్వివిధమగు రతివిలసితము కలిగెను. అది నిరూపించుటకు శక్యము కానిది. కావుననే ఆపుత్రులిద్దరును ఏకస్వభావులు కాకుండిరి. అందొకఁడు భోజన ప్రియుఁడు. ఇంకొకడు - శక్తిధరుడు. మహేశ్వర స్త్వాం పరిణీయలేబే (**2**శ. **24**శ్లో) అను శ్లోకముయొక్క యర్థము నిచట గుర్తించునది.

మూ॥ మాధురీ రసపరిప్లుతా ఇమాః
కావ్యకణ్ఠ విదుషో రథోద్ధతాః
ఆదధత్వచలనాథనన్దినీ
మానసే కమపి మోదముత్తమమ్ ॥ 25

విగలిత వేద్యాంతరమును, అనుభవైక వేద్యమును, అగు మాధుర్యమేయగు రసము చేత పరిప్లుతములు. కావ్యకంఠపదలాంఛనుఁడగు విద్వాంసుని చేత విరచితములు – అగు నీరథోద్ధతములు – నగరాజనందిని మనస్సునందు. ఒకానొక యానందవిశేషమును గలిగించునుగాత!

ప్రభ:- విగలిత వేద్య + అంతరము = తెలియదగిన వేరొకవస్తువు లేనిది. పరిప్లుతములు = వ్యాప్తములు. రథోద్ధతలు – రథోద్ధతయను పేరుగల వృత్తములచేత రచింపఁబడిన నుతులు.

ఈ స్తబకము – కుమార సంభవమునందలి యష్టమసర్గమునందలి ధోరణినవలంబించి, నింబధింపఁబడినదను నంశము – కాళిదాస కావ్యజ్ఞులగు పండితులకు స్పష్టముగా దిలిసియే యుండును. ఉ॥ అందును – ఇందునుగూడ రథోద్ధతావృత్తమే ప్రయోగింపఁబడినది. శృంగారమే విషయము. పార్వతిని సంబోధించి 'వ్యాజహార సహధర్మచారిణీమ్' 'పద్మకాన్తి మరుణ త్రిభాగయోః' (కు. సం. **8**, స, **2** శ్లో ఇత్యాదుల చేత కుసుమితో పవన – సంధ్యాకాల – రాత్ర్యాది – శృంగారోద్దీపన విభావవర్ణనమును పరమేశుఁడు కామించిన సంవిధానమందున్నది. ఇందుగూడ ''త్వా మిదంకిల జగాదశఙ్కరః'' ఇత్యాదుల చేత తాదృశమగు వర్ణనము పరమేశ్వర కృతమైయున్నది. ఈ రెండిటికిని గల భేదమును మాత్రము పాఠకులు గుర్తించవలయును. **అద్వితీయుఁడగు కాళిదాస కవిసార్వభౌముని కవితయందు- ఉమా సహస్రకవియగు కావ్యకంఠమునికి - నిత్యసంజాతము, అపారము. అగుభక్తి**

కలదనునది మాత్రము సత్యము. అయినను ప్రపంచ మాతాపితరులగు పార్వతీ-పరమేశ్వరుల సురతమును కాళిదాసునివలె వర్ణింపక, ఎట్లోయొక విధమున తద్ వర్ణనము విడువ దగినదను తలంపున స్వీయరచనమును సంగ్రహించెను. కావుననే రత్యుత్పాదకమగు శృంగారవర్ణనము నారంభించి ''బ్రహ్మచర్య నియమాదచఞ్చలా'' అను శ్లోకమున ''వేదకోరతి రహస్యమావయోః'' అని తానొనర్చిన ముగింపును సమర్థించెను. వేద – వేదాంత – మంత్ర – తంత్ర – జ్ఞాన – యోగ – ఉపాసనాదుల చేత – ఉపబృంహితము – భక్తిపరము – గురుతరములగు నీ స్తోత్ర కావ్యమున కనురూపమగునట్లు ఉమా మహేశ్వర – రతిరహస్యము – అప్రమేయమని చెప్పి యుపసంహరించుట నవకవి పండితామోదదాయక మగుచున్నది.

ఇతి శ్రీ మహర్షి రమణ భగవత్ పాదాన్తే వాసినో వాసిష్ఠస్య
నరసింహసూనోః గణపతిమునేః కృతావుమాసహస్రే
ద్వాదశః స్తబకః సమాప్తః
సమాప్తంచ తృతీయం శతకమ్.

ఇది శ్రీ మహర్షి – రమణ భగవత్పాదశిష్యుడు –
శఠమర్షణసగోత్రుఁడు–
శ్రీమత్ పంతుల పేరయశాస్త్రి పౌత్రుఁడు వేంకటరామ
బుధేంద్రపుత్రుఁడు అగు లక్ష్మీనారాయణశాస్త్రిచే
నాంధ్రీకరింపఁబడిన ఉమాసహస్రమను స్తోత్ర
కావ్యమున పండ్రెండవ స్తబకము
(తృతీయ శతకము)

****